Telugu Daily www.shenarthimedia.in RNI NO : TELTEL/2023/89146

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :2 సంచిక: 183 సోమవారం16 జూన్ 2025 పేజీలు :4 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy




## సర్కారు పాఠశాలల్లో అధునాతన

# ఎడ్ టెక్ సదుపాయాలు

### ప్రముఖ ఎన్‌జీవో సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూ

**శెనార్తి మీడియా,హైదరాబాద్ :**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జీవో సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఎంవోయూ కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలను అందించనున్నది తెలంగాణ ప్రభుత్వం. ఇందుకు నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తున్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో ఈరోజు ఎంవోయూ కుదుర్చుకుంది.దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో విద్యా నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు వస్తున్నాయి వివిధ సంస్థలు. నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్ ఫారమ్‌తో 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5,000కి పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్ ను ఈ సంస్థ అందిస్తుంది.ఫిజిక్స్ వాలా ఇంటర్



విద్యార్థులను నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది. ఖాన్ అకాడమీ రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత ఎస్టీఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది. డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలో ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. పై జామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్ మరియు కంప్యూటేషనల్ థింకింగ్ పై శిక్షణను అందిస్తుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను మెరుగుపరుస్తుంది.




# పోలీసుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

### ఐదు రకాల సేవలపై సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్‌లు




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**


రాష్ట్రంలో పోలీసుల సేవలపై ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న ఐదు ముఖ్య సేవలపై ప్రజలు తమ అభిప్రాయం తెలుపవచ్చు. ఇందుకోసం క్యూఆర్ కోడ్ ఆధారిత 'సిటిజన్ ఫీడ్‌బ్యాక్' విధానాన్ని పోలీస్ శాఖ ప్రవేశపెట్టింది.ఈ ప్రక్రియలో ముందుగా ప్రజలు క్యూఆర్(qr code) కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు స్వీకరణ, ఎస్ఐఆర్, ఈ-చలాన్(E-Challan), పాస్‌పోర్ట్ (Passport) ధ్రువీకరణ.. ఇతర సేవలపై తమ అభిప్రాయం తెలుపవచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ క్యూఆర్ కోడ్ పోస్టర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు తమకు ఎదురైన అనుభవాలను, పోలీసుల స్పందనను, సేవల నాణ్యతను ఈ యాప్ ద్వారా తెలియజేయవచ్చు. ప్రస్తుతం పలుచోట్ల ప్రజలు స్కాన్ చేసి అభిప్రాయాలను తెలియజేస్తుండగా, అందులో అధిక శాతం పోలీసుల సేవలపై సానుకూల స్పందనే వచ్చినట్లు సమాచారం.ఉత్తమ ప్రదర్శనకు అవార్డులుసిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమంగా పని చేసిన పోలీస్ స్టేషన్లకు ఇటీవల అవార్డులు ప్రకటించారు. 709 స్టేషన్లలో ప్రామాణిక సేవలు అందించిన 10 మంది ఎస్ఐలకు డీజీపీ జితేందర్ అవార్డులు అందించారు.పోలీసుల పనితీరుపై ప్రజల ప్రశంసలతో పాటు అవసరమైన సూచనలు కూడా వస్తుండటంతో ఈ కార్యక్రమం ప్రజా సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

**ఫిర్యాదులు నేరుగా డీజీపీ కార్యాలయానికే**

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత పొందిన వివరాలు నేరుగా డీజీపీ కార్యాలయానికి చేరుతాయి. వాటిని కేవలం ఉన్నతాధికారులే పరిశీలిస్తారు. కాబట్టి ఎవరు భయపడకుండా స్వేచ్ఛగా అభిప్రాయం తెలపవచ్చు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయి. ఇందులో ఎలాంటి సందేహాలు అక్కరలేదు.

**ఆర్ ప్రకాష్, మంచిర్యాల ఏసీపీ**







# 32 ఏండ్ల తర్వాత..

## మమత హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**శెనార్తి మీడియా, నల్లగొండ:** నల్లగొండలోని మమత హైస్కూల్ పదవ తరగతి (1991–92 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ముప్పై రెండు ఏళ్ల తర్వాత జరిగిన ఈ కార్యక్రమంలో బాల్యపు జ్ఞాపకాలను నెమరేసు కుంటూ ఆనందోత్సాహంతో మునిగిపోయారు. ఆ నాటి ఉపాధ్యాయులు కూడా హాజరై తమ శిష్యులు వివిధ వృత్తుల్లో స్థిరపడి ఉండటాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డిపల్లి యాదగిరి, శ్రీపతి యాదయ్య, నామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖవీ తదితరులు కలసి నిర్వహిం చారు. మమత హైస్కూల్ కరస్పాండెంట్ యానాల ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు రామ్మూర్తి, సలీం, చంద్రశేఖర్రెడ్డి, వెంక ట్రాంరెడ్డి, శేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షల వెల్లువ



**శెనార్తి మీడియా, నల్లగొండ:**



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినంద సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు దుబ్బ అశోక్ సుందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుబ్బ రూపా రాణి ఆదివారం డిప్యూటీ సీఎంను కలిశారు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. బర్త్ డే విషెస్ తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

- గురువులకు ఆత్మీయ సత్కారం
- చిన్ననాటి జ్ఞాపకాల్లో మునిగిన పూర్వ విద్యార్థులు

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని నవాబుపేట ప్రభుత్వ పాఠశాల 1999–2000 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు 70 మంది విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై మళ్లీ కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులతో కలిసి చదువుకున్న పాఠశాల ఆవరణలోనే ఈ కార్యక్రమం జరిగింది. సోషల్ మీడియా ద్వారా సమీకృతమైన వారు మునుపటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్ననాటి అల్లరి పనులు, ఆ రోజుల్లోని అనుభూతులు, ప్రస్తుతం వారి ఉద్యోగాలు, కుటుంబ జీవితం తదితర విషయాలపై పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. వారికి మెమెంటోలు అందజేసి ఆశీస్సులు పొందారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. రోజంతా ఆనందంగా గడిపారు. ఇకపై ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా పరస్పరం తోడుగా ఉండాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ వేడుకల్లో గురువులు రాజిరెడ్డి, లింగారెడ్డి, హరికిషన్, అంజిరెడ్డి, శ్రీవాణి పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల్లో సిద్దుల సుదర్శన్ యాదవ్, చెప్యాల శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ మక్బుల్ పాషా, బోయిని సంపత్, గుళ్ల కిష్టయ్య, బత్తిని వెంకటేశ్వర్, కూతురు రాజిరెడ్డి, కర్నాల శ్రీనివాస్, గుళ్ల తిరుపతి, కూతురు శ్రీకాంత్ రెడ్డి, దామ శ్రీనివాస్, బుర్ర రాజు, బుర్ర శ్రీనివాస్, జాగిరి కుమారస్వామి, చంద్రశేఖర్, గుళ్ల శ్రీకాంత్, బత్తిని శ్రీను, రజిత, జోష్ణ, వీరవనిత, సుజాత, అనిత, సరళ, శ్రీలత, సబిత పాల్గొన్నారు.



# లంబాడిపల్లె రెడ్డి సంఘం కార్యవర్గం

**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామ రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడిగా పింగిలి సంపత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన రెడ్డి సంఘం సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా అనుమడ్ల కనకారెడ్డి, నల్లాల రాజిరెడ్డి, కార్యదర్శిగా కాటం రత్నాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా నాగెల్లి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా శ్యామకూర సంపత్ రెడ్డి, శ్యామకూర మోహనరెడ్డి, కాటం శ్రీనివాస్ రెడ్డి, కాటం రవీందర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కాటం సంపత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి నూతన నాయ కత్వానికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రాంతాల మహిపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సంది రాజిరెడ్డి, మాజీ అధ్యక్షులు నల్లాల మధుసూదన్ రెడ్డి, మోరపల్లి సంపత్ రెడ్డి, రాజిరెడ్డి, కాటం శ్రీనివాస్ రెడ్డి, అనుమల శ్రీకాంత్ రెడ్డి, జంగా రమణారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, పింగిలి రాంరెడ్డి, కర్ర అశోక్ రెడ్డి, బంగాళా రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నుస్తులాపూర్‌లో ప్రభుత్వ భూముల కబ్జా



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

- 14 .8ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ప్రైవేట్ విద్యాసంస్థ
- తక్షణమే చర్యలు తీసుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం

తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ రెవెన్యూ పరిధిలోని 574 సర్వే నెంబర్ లో గల 14 ఎకరాల 8 గుంటల ప్రభుత్వ భూమిని ఓ ప్రైవేట్ విద్యాసంస్థ అక్రమంగా ఆక్రమించిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ భూమిలో కళాశాల భవనాలు నిర్మించి, విద్యాసంస్థ నడుపుతున్నప్పటికీ అధికారులు నిశ్శబ్దంగా ఉండటం తీవ్రంగా ఖండించారు. 2012లో తహసీల్దార్ 13 ఎకరాల 18 గుంటల భూమిని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చాలని సూచించినా, దాన్ని పూర్తిగా విస్మరించి 574 సర్వే నెంబరును 8 బై నెంబర్లుగా విభజించి ఖాతాలు సృష్టించారని తెలిపారు. 574/2లో జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన కార్యాలయం, మిగతా బై నెంబర్లలో కళాశాల భవనాలు ఉన్నట్లు ఇస్రో శాటిలైట్ మ్యాప్ ద్వారా తేలిందని పేర్కొన్నారు. కేవలం 574/8 లో మాత్రమే 30 గుంటల భూమి ప్రొహిబిటెడ్ జాబితాలో ఉండగా, మిగతా భూమిని కూడా చేర్చాలన్నారు. కోట్ల విలువైన భూమిని అక్రమంగా ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, తక్షణమే సర్వే చేసి హద్దులు నిర్ణయించి భూమిని ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల ఇండ్ల స్థలాల కోసం ఈ భూమిని కేటాయించాలని, లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో భారీ భూ పోరాటాలు జరుగుతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మామిడిపల్లి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

# రేణుకా మాత గౌడ సంఘం కార్యవర్గం



**శెనార్తి మీడియా, వేములవాడ:** రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రేణుక మాత గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బత్తిని ఎల్ల గౌడ్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వెంగళ శ్రీకాంత్ గౌడ్, కోశాధికారిగా భైరగొని అంజ య్య గౌడ్, ఉపాధ్యక్షులుగా విక్కుర్తి అంజయ్య గౌడ్, సార నర్సయ్య గౌడ్, గౌరవ అధ్యక్షులుగా పొన్నం రవిచంద్ర గౌడ్, పులి రాజు గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు బాలసాని తిరుపతి గౌడ్, పులి రాంగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

# బాస్కెట్ బాల్ విజేతలుగా ఔల్ క్లబ్, హుజురాబాద్ బాలికలు



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

- ఐ స్క్వేర్ ఆధ్వర్యంలో వన్ డే టోర్నమెంట్
- ట్రాన్సకో క్రీడా ప్రాంగణంలో 20 జట్లు పోటీ

జిల్లా కేంద్రంలోని ట్రాన్సకో క్రీడా ప్రాంగణంలో ఐ స్క్వేర్ ఆధ్వర్యంలో జరి గిన బాస్కెట్ బాల్ వన్ డే టోర్నమెంట్‌లో బాలికల జట్లు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. ప్రతిభా ప్రదర్శనలో కరీంనగర్ ఔల్ క్లబ్ (స్టేడియం) బాలికల జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలిచింది. హుజురాబాద్ బాలికల జట్టు కూడా శ్రేష్ఠ ప్రతిభ కనబరిచి మొదటి స్థానాన్ని గెలుచుకుంది. ఈ టోర్నీలో అనంత రెడ్డి, శ్రీధర్ రావు, సునీల్ రెడ్డి, పర్మిత్ కౌర్, అరుణ్ తేజ్, అభినష్ తదితరులు పాల్గొన్నారు. విజేత జట్లకు ప్రశంసలు వెల్లువెత్తాయి.

# పత్తికుంటపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు



**శెనార్తి మీడియా, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని పత్తికుంట పల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనా లను ఘనంగా నిర్వహించారు. "మమ్మల్ని పిల్లా పాపలను సల్లంగా చూడు పోచమ్మ తల్లి" అంటూ మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పులతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. శివసత్తుల నృత్యాలతో మేళతాళాలు మార్మోగాయి. పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తల్లి ఆశీస్సులతో గ్రామస్థులంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధి గా కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్ర మంలో జుట్టు శేఖర్, వినోద్, మహేందర్, రమేష్, మధు, భాస్కర్, నరేష్, నవీన్, నగేష్, సురేష్ సహా గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ భూమ్ రెడ్డి సేవలు మరువలేనివి

**శెనార్తి మీడియా, చిగురుమామిడి:**

ఉత్తర తెలంగాణలో తొలి జనరల్ సర్జన్‌గా పేరుగాంచిన ప్రముఖ వైద్యుడు వొంటెరి భూమ్ రెడ్డి మృతి పట్ల రెడ్డి ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కాటం సంపత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం చిగురుమామిడి మండల కేంద్రంలో భూమ్ రెడ్డి స్మృతిలో రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూమ్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ, మొదటి ప్రధానమంత్రి నెహ్రూకు వైద్యం చేసిన ఘనత భూమ్ రెడ్డిదేన ని, పలు దేశాల నుంచి వచ్చిన అవకాశాలను వదిలి కరీంనగర్ కేంద్రంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఇటీవల రేకొండలో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ చాడ శోభ కుటుంబాన్ని రెడ్డి ఐక్య వేదిక నేతలు పరామర్శించారు. వారి కుమారులు శ్రీధర్ రెడ్డి, మురళీధర్ రెడ్డిలతో మాట్లాడి మృతికి గల కారణాలు తెలుసుకుని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతాల మహిపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వంటకాల సంపత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సందిరాజు రెడ్డి, జంగ రాజిరెడ్డి, పూల లచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాగేల్లి రాజిరెడ్డి, నల్లాల మధుసూదన్ రెడ్డి, మోరపల్లి సంపత్ రెడ్డి, కర్ర అశోక్ రెడ్డి, కాటం తిరుపతిరెడ్డి, రేకుల శంకర్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, పన్యాల దశమంత రెడ్డి, సాగర్ రెడ్డి, శ్యామకూర రాజిరెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా పోచమ్మ బోనాలు

గన్నేరువరం గ్రామంలో మాల కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొని జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- శెనార్తి మీడియా, బెజ్జంకి




# దక్షిణాఫ్రికాకు జాక్ పాట్..

**డబ్ల్యూటీసీ ఫైనల్ గెలచిన దక్షిణాఫ్రికాకు భారీ ప్రైజ్‌మనీ**

**రూ.31.05 కోట్ల ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్న ప్రొటీస్**

**క్రితం రెండు సార్లతో పోలిస్తే భారీగా పెరిగిన ప్రైజ్‌మనీ**

27 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఐసీసీ టైటిల్ సాదించిన దక్షిణాఫ్రికా భారీ మొత్తంలో ప్రైజ్‌మనీని అందుకుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 విజేతగా నిలిచినందుకు గాను.. దక్షిణాఫ్రికా జట్టు ఛాంపియన్ షిప్ గదతో పాటు ప్రైజ్‌మనీ కింద 3.6 మిలియన్ల డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.31.05 కోట్లు అందుకుంది. గత 2 ఎడిషన్‌లతో పోలిస్తే.. ఈసారి ప్రైజ్‌మనీని ఐసీసీ రెండింతలు పెంచడం గమనార్హం. గత రెండు పర్యాయాలు విజేతలకు రూ.13.67 కోట్ల చొప్పున మాత్రమే అందడం గమనార్హం. ఈసారి రన్నరప్‌కు కూడా అంతకంటే ఎక్కువే ప్రైజ్‌మనీ దక్కింది. ఇక ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన ఆస్ట్రేలియాకు 2.1 మిలియన్ల డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.18.63 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది. ఇక డబ్యూటీసీ 2023-25 సైకిల్‌లో పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానంలో నిలిచిన భారత జట్టుకు 1.44 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 12. 42 కోట్లు) క్యాష్ ప్రైజ్ దక్కింది.

**డబ్ల్యూటీసీ 2025 ప్రైజ్‌మనీ వివరాలు ఇవే..**

**దక్షిణాఫ్రికా: రూ. 31.05 కోట్లు**
**ఆస్ట్రేలియా: రూ. 18.63 కోట్లు**
**భారత్: రూ. 12.42 కోట్లు**
**న్యూజిలాండ్: రూ. 10.35 కోట్లు**
**ఇంగ్లండ్: రూ. 8.28 కోట్లు**
**శ్రీలంక: రూ. 7.24 కోట్లు**
**బంగ్లాదేశ్: రూ. 6.21 కోట్లు**
**వెస్టిండీస్: రూ. 5.17 కోట్లు**
**పాకిస్థాన్: రూ. 4.14 కోట్లు**



## హేజిల్‌వుడ్‌కు ఆస్ట్రేలియా కంటే ఆర్సీబీనే ఎక్కువైంది!: మిచెల్ జాన్సన్



ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఆస్ట్రేలియా ఓటమి పాలైన తర్వాత ఆ జట్టుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. కీలక మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించకపోవడం, రెండో ఇన్నింగ్స్‌లో బౌలర్లు పేలవ ప్రదర్శన చేయడంతో ఆ జట్టు పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో ఇటీవల పేలవ ప్రదర్శన చేస్తున్న ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుషేన్ లాంటి ప్లేయర్లను జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఆస్ట్రేలియా మాజీ పేసర్ మిచెల్ జాన్సన్ మాత్రం.. ఐపీఎల్‌లో ఆడిన ఆస్ట్రేలియా ఆటగాళ్లపై విమర్శలు గుప్పించాడు. ఆస్ట్రేలియా జట్టు ప్రయోజనాలకంటే కొందరికి ఐపీఎల్ ఎక్కువైందని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. జోష్ హేజిల్‌వుడ్‌ను ఉద్దేశించి విమర్శనాస్త్రాలు సంధించాడు. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, ప్యాట్ కమిన్స్, నాథన్ లైయన్‌తో కూడిన బౌలింగ్ 'బిగ్ ఫోర్' విఫలమైందని మిచెల్ జాన్సన్ వ్యాఖ్యానించాడు. ముఖ్యంగా హేజిల్‌వుడ్ తీరుపై తీవ్ర విమర్శలు చేశాడు. "ఇటీవల కాలంలో జోష్ హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అతడు జాతీయ జట్టు కంటే ఐపీఎల్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. వాయిదా పడ్డ అనంతరం ప్రారంభమైన ఐపీఎల్‌కు తిరిగి వెళ్లాలన్న అతడి నిర్ణయం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక స్పిన్నర్ లైయాన్ వికెట్లు పడగొట్టేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. పేలవ ప్రదర్శన చేస్తున్న లబుషేన్‌ను కొనసాగించడం ఏమాత్రం కరెక్టు కాదు. అయితే ఒకేసారి జట్టులోని టాప్ ఆర్డర్‌ను ప్రక్షాళన చేయలనుకోవడం కూడా ప్రమాదకరమే. సెలక్టర్లకు ఈ విషయం తెలుసనే అనుకుంటున్నా," అని మిచెల్ జాన్సన్ ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. కాగా ఐపీఎల్ 2025లో హేజిల్‌వుడ్ ఆర్సీబీ తరఫున ఆడాడు. ఈ టోర్నీలో 12 మ్యాచ్‌లు ఆడిన అతడు.. ఏకంగా 22 వికెట్లు తీశాడు. ఆర్సీబీ తొలి సారి ఐపీఎల్ విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లోనూ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్యను ఔట్ చేశాడు. ఐపీఎల్ ఫైనల్ జూన్ 3న జరగ్గా.. ఆ తర్వాతే అతడు డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడేందుకు ఆసీస్ జట్టులో చేరాడు. డబ్ల్యూటీసీ ఫైనల్‌లో 34 ఓవర్లు వేసి కేవలం రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

# భారత్ ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్..
# సర్ఫరాజ్ మెరుపు సెంచరీ..

**సెలక్టర్లకు స్వీట్ వార్నింగ్..!**

**ఫర్వాలేదనిపించిన సాయి సుదర్శన్, అభిమన్యు**

**ఒక్క వికెట్ కూడా తీయలేకపోయిన బుమ్రా**



ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు జరుగుతున్న ఇండియా ఇంట్రా స్క్వాడ్ మ్యాచులో సర్ఫరాజ్ ఖాన్ అదరగొట్టాడు బుమ్రా, సిరాజ్, అర్షదీప్ సింగ్, రవీంద్ర జడేజా లలాంటి ప్లేయర్లను ఎదుర్కొంటూ సెంచరీ బాదేశాడు. అది కూడా టీ20 స్టైల్‌లో కావడం గమనార్హం. భారత్, ఇండియా- ఏ జట్ల మధ్య జరిగిన ఈ గేమ్‌లో రెండో రోజు ఆటలో సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ చేశాడు. మొత్తంగా 76 బంతుల్లో 101 రన్స్ చేశాడు. ఆ తర్వాత ఇతరులకు బ్యాటింగ్ ప్రాక్టీస్ ఇవ్వాలనే ఉద్దేశంతో రిటైర్ అయ్యాడు. కాగా ఈ మ్యాచులో టీమిండియా టెస్టు జట్టులో ఉన్న అభిమన్యు ఈశ్వరన్ (39), సాయి సుదర్శన్ (38) ఫర్వాలేదనిపించారు. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భఆరత్.. 459 పరుగులు చేసింది. అనంతరం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా- ఏ 299/6 రన్స్ స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ 45 రన్స్, శార్దుల్ ఠాకూర్ 19 రన్స్ స్కోరు చేశారు. సర్ఫరాజ్ మాత్రం మెరుపు బ్యాటింగ్‌లో అలరించాడు. ఇప్పటికే ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక టెస్టు మ్యాచులో 92 పరుగులు చేసిన సర్ఫరాజ్.. అదే ఫామ్‌ను కొనసాగించాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు తనను ఎంపిక చేయని.. సెలక్టర్లకు స్వీట్ వార్నింగ్ ఇచ్చాడు. అయితే ఇంట్రా స్క్వాడ్ మ్యాచులో భారత ప్రధాన బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా .. ఆశించిన మేర రాణించలేకపోయాడు. ఏడు ఓవర్లు వేసిన బుమ్రా.. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. 36 పరుగులు సమర్పించుకున్నాడు. అర్షదీప్ సింగ్ కూడా 12 ఓవర్లు వేసి ఒక్క వికెట్ తీయకుండానే 52 రన్స్ సమర్పించుకున్నాడు. మహమ్మద్ సిరాజ్(2/86), ప్రసిద్ధ్ కృష్ణ (2/41), నితీశ్ కుమార్ రెడ్డి ఒక వికెట్ తీశాడు. ఇక భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య టెస్టు సిరీస్ జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. హెడింగ్లే వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.

**ఇంగ్లాండ్‌తో టెస్టుల కోసం భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేడా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుదంర్, శార్దుల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్

# టెన్షన్‌తో నిద్రమాత్రలు తీసుకోవాలనుకున్నా

## ఎయిడెన్ మార్‌క్రమ్




ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ 2025 ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించిన దక్షిణాఫ్రికా టెస్టు ఛాంపియన్‌గా అవతరించింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టైటిల్ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ముందు ఆస్ట్రేలియా 282 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. ఈ సమయంలో ఆస్ట్రేలియాదే గెలుపు అని చాలా మంది అంచనా వేశారు. కానీ అద్భుతంగా రాణించిన దక్షిణాఫ్రికా బ్యాటర్లు.. విజయాన్ని అందుకున్నారు. ఇందులో ముఖ్యంగా ఆ జట్టు ఓపెనర్ ఎయిడెన్ మార్‌క్రమ్ సెంచరీతో జట్టును గెలిపించాడు.గతంలో చాలా సార్లు దక్షిణాఫ్రికా ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లలో ఓడిపోయింది. కొన్ని సార్లు ఈజీగా గెలిచే స్థానం నుంచి అనూహ్యంగా తడబడి.. ఒత్తిడికి చిత్తయి పరాజయం పాలైంది. గతేడాది భారత్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లోనూ ఇదే పునరావృతం చేసింది. కానీ ఈసారి మాత్రం ప్రొటీస్ టీమ్ పట్టువదల్లేదు. అందుకు ప్రధాన కారణం మార్‌క్రమ్. ఫైనల్ మ్యాచ్ తర్వాత మాట్లాడిన మార్‌క్రమ్.. టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో భారత్ చేతిలో ఓటమి తనను ఎంతో బాధించిందని చెప్పాడు. మళ్లీ అలాంటి పరిస్థితి రాకూడదనే లక్ష్యంగా ఆడినట్లు పేర్కొన్నాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని వివరించాడు. "ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించా. భారత్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో ఔట్ అయ్యాక నేను ఒంటరిగా కూర్చుని ఎంతో నిరాశకు గురయ్యాను. మరోసారి అలాంటి పరిస్థితి రాకూదని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచనే నాలో స్ఫూర్తినింపింది. అందుకే డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఎక్కువ సేపు క్రీజులో ఉండగలిగా" అని మార్‌క్రమ్ అన్నాడు. "ఫైనల్‌లో సెంచరీ కొట్టాక నేను చాలా భావేద్వేగానికి లోనయ్యా. జట్టు విజయం కోసం పోరాడుతున్నందుకు ఏడుపు కూడా వచ్చింది. ముఖ్యంగా మూడో రోజు ఆట ముగిశాక.. ఆ రోజు రాత్రి నాకు అస్సలు నిద్రపట్టలేదు. మా విజయానికి ఇంకా 69 పరుగులు అవసరమైన దశ అది. నిద్ర కోసం ఓ దశలో నిద్ర మాత్రలు తీసుకోవడానికి కూడా ప్రయత్నించా. నా మనసు నిండా ఏవేవో ఆలోచనలు తిరిగాయి. కానీ చివరి రోజు మేం అనుకున్న విజయం సాధించాం" అని చెబుతూ మార్‌క్రమ్ భావోద్వేగానికి గురయ్యాడు.

# భారత్ ఆశలకు ఐసీసీ బ్రేక్

**డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ నిర్వహణకు భారత్ ఆసక్తి**

**వచ్చే మూడు ఫైనళ్లు ఇంగ్లండ్‌లోనే అని ఐసీసీ నిర్ణయం!**

ప్రస్తుతం ఇంగ్లండ్ వేదికగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ జరుగుతోంది. ఈసారి దక్షిణాఫ్రికా విజయం ఖాయంగా కనిపిస్తోంది. భారత్‌లో కూడా ఈ ఫార్మాట్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఉన్న క్రేజే దానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీసీ 2027 ఫైనల్‌ను నిర్వహిండానికి భారత్ ఆసక్తి కనబరుస్తోంది. అయితే భారత్ ఆశలకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్- ఐసీసీ బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వార్తలు వెలువడుతున్నాయి. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఫుల్ క్రేజ్ ఉన్న ఈ ఫైనల్ పోరుకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి- (బీసీసీఐ) ఆసక్తి చూపినప్పటికీ.. వచ్చే మూడు సీజన్ల ఫైనల్స్‌ను కూడా ఇంగ్లాండ్‌లోనే నిర్వహించాలని ఐసీసీ (ఐసీసీ) నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2019లో మొదలైంది. రెండేళ్ల సైకిల్ తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్స్‌ను 2021 నుంచి నిర్వహిస్తున్నారు. 2021లో ఇంగ్లండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ ఓటిమి పాలైంది. న్యూజిలాండ్ డబ్ల్యూటీసీ ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 2023లో కూడా ఇంగ్లండ్‌లోనే జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరిన టీమ్‌ఇండియా.. ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. 2023-25 సైకిల్‌లో భాగంగా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌కు లార్డ్స్ వేదికైంది. తాజా సీజన్‌తో కలిపి ఇప్పటివరకు మూడు ఎడిషన్ల ఫైనల్ మ్యాచ్‌లను (సౌతాంప్టన్, ఓవల్, లార్డ్స్) ఇంగ్లండ్‌లోనే నిర్వహించారు.

**ఐసీసీ అధికారిక ప్రకటన అప్పుడే**

అయితే భారత్ ఆసక్తి కనబర్చినప్పటికీ.. 2027, 2029, 2031లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆతిథ్య హక్కులను ఇంగ్లండ్‌కే ఇవ్వాలని ఐసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే దీనిపై ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు క్రీడా వర్గాల సమాచారం. జులైలో సింగపూర్ వేదికగా జరిగే ఐసీసీ వార్షిక సదస్సులో ఈ నిర్ణయాన్ని అధికారికంగా ఆమోదించి ప్రకటన విడుదల చేయనున్నారని వార్తలు వస్తున్నాయి. ఇక వచ్చే డబ్ల్యూటీసీ మూడు ఫైనల్స్‌ను ఇంగ్లండ్‌లోనే నిర్వహించడం లాంఛనమేనని యూకేకు చెందిన ఓ వార్తా సంస్థ కథనం ప్రచురించింది. ఇక, 2025-27 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ సైకిల్ కూడా ఇంగ్లాండ్‌లోనే ప్రారంభం కానుంది. ఇటీవలే దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం అవుతుంది.

# 'కన్నప్ప' ట్రైలర్ విడుదల



బహుభాషా నటుడు విష్ణు మంచు టైటిల్ రోల్‌లో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కన్నప్ప' అధికారిక తెలుగు ట్రైలర్ విడుదలైంది. ఈ సినిమాలో మోహన్ బాబు, ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ వంటి దిగ్గజ నటులు నటిస్తుండటంతో సినిమాపై మొదటినుంచీ భారీ అంచనాలున్నాయి. తాజాగా విడుదలైన ట్రైలర్, ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంది, ముఖ్యంగా తిన్నడి పాత్రధారి పలికే సంభాషణలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

ట్రైలర్ ప్రారంభంలోనే, "ఏ దేవుడు లేరు జీవులు లేరు... అది వట్టి రాయి" అంటూ తిన్నడి పాత్ర తనదైన శైలిలో భగవంతుని ఉనికిని ప్రశ్నించే సంభాషణలతో ఆకట్టుకుంటుంది. శివుడిని "రాయి" అని సంబోధించడంపై గూడెంలోని పెద్దల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. "శివుడిని రాయి అంటావా?", "రాయిని రాయనక ఏమంటారు?" వంటి సంభాషణలు కథలోని సంఘర్షణను స్పష్టం చేస్తున్నాయి.

ఆ తర్వాత కాలంలో... "ఈ వాయులింగ రహస్యం కాపాడటానికి నా ప్రాణాల సైతం అర్పిస్తాను. ఈ గూడెంలో ఏ బిడ్డకీ ఆపద రానివ్వను ఇది నా ఆన, తిన్నడి ఆన" వంటి డైలాగ్‌లు తిన్నడి పాత్రలోని ధీరత్వాన్ని, నిబద్ధతను తెలియజేస్తున్నాయి.

"ఆ పెద్దోళ్ళందరికంటే నేనే పెద్దోడిని, నన్ను మించిన శివభక్తుడు ఈ సృష్టిలో లేడు" అని తిన్నడు ధీమాగా చెప్పడం, "నువ్వు నీ దేవుడు తోడు దొంగలే" వంటి మాటలు అతని తిరుగుబాటు స్వభావాన్ని, అచంచల విశ్వాసాన్ని చాటుతున్నాయి. "శివయ్య అని మనసారా పిలువు" అన్న మాటలకు, "అది ఈ జన్మలో జరగదు" అని బదులివ్వడం తిన్నడి పాత్రలోని వైవిధ్యాన్ని సూచిస్తుంది. "తెలివిలో నీకన్నా గొప్పవాడు ఒకడు ఉన్నాడని తెలిసి అతని బొటనవేలు తెంపించింది నువ్వే కదా" అనే సంభాషణ ద్వారా పరోక్షంగా ఏకలవ్యుడి ప్రస్తావన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంమీద, ట్రైలర్ ద్వారా 'కన్నప్ప' చిత్రం ఒక గొప్ప శివభక్తుడి కథను భారీ హంగులతో, బలమైన భావోద్వేగాలతో తెరకెక్కిస్తున్నట్లు స్పష్టమవుతోంది. విజువల్స్, నేపథ్య సంశీతం, ముఖ్యంగా పవర్ ఫుల్ డైలాగ్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. విష్ణు మంచుతో పాటు మోహన్ బాబు, ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ వంటి హేమాహేమీలు నటిస్తుండటంతో ఈ సినిమా భారతీయ సినీ చరిత్రలో ఒక ప్రత్యేక చిత్రంగా నిలిచిపోతుందని అభిమానులు ఆశిస్తున్నారు. 'మహాభారతం' వంటి విజయవంతమైన సీరియల్‌ను అందించిన ముకేశ్ కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన దర్శకత్వ ప్రతిభ, విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ కావడంతో సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఎంతో కాలంగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ట్రైలర్ మంచి అనుభూతిని పంచిందని చిత్ర వర్గాలు తెలిపాయి.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, 'కన్నప్ప' చిత్రాన్ని ఈ నెల 27వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ సినిమా తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల వారిని కూడా ఆకట్టుకుంటుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.





## చుట్టూ 15 మంది మగాళ్లు..

### ఒంటిపై నూలుపోగు లేకుండా నగ్నంగా..

మలయాళ బ్యూటీ అమలా పాల్, తన సినిమాలతోనే కాకుండా వ్యక్తిగత జీవితంతోనూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె నటించిన 'ఆడై' ( తెలుగులో 'ఆమె' ) చిత్రంలోని నగ్న సన్నివేశం గురించి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మరోసారి ప్రస్తావించారు. 15 మంది మగవారి సమక్షంలో దుస్తులు లేకుండా నటించడం తనకు సవాలుగా అనిపించిందని, ఆ సమయంలో వారిని తన భర్తలుగా భావించి నటించానని ఆమె వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. మలయాళ బ్యూటీ అమలాపాల్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 2009లో మలయాళ చిత్రం 'నీలతామర'తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ .. తమిళంలో 'మైనా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ చిత్రానికి గాను తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమ నటి అవార్డు సైతం అందుకుంది. ఇక తెలుగులో నాగచైతన్య సరసన 'బెజవాడ' చిత్రంలో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత నాయక్, లవ్ ఫెయిల్యూర్, ఇద్దరమ్మాయిలతో వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకి బాగానే దగ్గరైంది.

## ప్రేమ పై సమంత క్లారిటీ


### ఒకేసారి రాజ్ నిడిమోరు భార్యకు, శోభితకు కౌంటర్

సమంత, రాజ్ నిడిమోరు మధ్య సంబంధం గురించి కొద్దికాలంగా వదంతులు వస్తున్నాయి. సమంత నటించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్‌కు రాజ్ నిడిమోరు దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే ఇద్దరి మధ్య పరిచయం పెరిగిందనీ, అది ప్రేమగా మారిందనీ కొందరు చెబుతున్నారు. ప్రత్యేకంగా సమంత ఇటీవల పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఆ ఫొటోలో రాజ్ నిడిమోరు భుజంపై సమంత.. వాలి ఉండటం అభిమానులకు ఆసక్తికరంగా మారింది. ఇది కొందరిలో అనుమానాలను కలిగించినా.. మరికొందరు వీళ్లు పెళ్లి చేసుకోవడం కాయం అంటూ.. ఫిక్స్ అయిపోయారు..అయితే రాజ్ నిడిమోరు ఇప్పటికే వివాహితుడు. తాను.. తన భార్యకు విడాకులు ఇచ్చి సమంతను పెళ్ళి చేసుకోనున్నాడనె ప్రచారం జరుగుతోంది. రాజ్ నిడిమోరు భార్య మాత్రం ఇది వరకు ఎటువంటి అధికారిక ప్రకటన ఇవ్వలేదు. కానీ కొన్నిసార్లు సోషల్ మీడియాలో ఇన్ డైరెక్ట్ గా కామెంట్లు పెడుతూ వస్తోంది. ఈ క్రమంగా..సమంత తాజాగా తన సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. "ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండకండి. మీరు ఎవరినైనా ఆరాధించినప్పుడు అది వాళ్లకు చెప్పేయ్యండి. మనం మనుషులం, చాలా పెళుసు, తాత్కాలికం. మనుషులు మన ముందున ఉండగా మన మనోభావాలను వ్యక్తపరచుకోవాలి" అన్నది ఆమె పోస్ట్‌లో ఉండటం చర్చనీయాంశంగా మారింది.

## గ్లామర్ డోర్ లు ఎత్తేసిన సావిత్రక్క..

### - ఏకంగా బాత్రూమ్ లో స్నానం చేస్తు వీడియో రిలీజ్..
### - అతడ్ని టెంప్ట్ చేసేందుకంటూ రచ్చ..!

తీన్మార్ సావిత్రక్కగా ఫేమస్ అయిన బిగ్ బాస్ 3 కంటెస్టెంట్ శివజ్యోతి ఏకంగా తన బాత్రూమ్ వీడియోను రిలీజ్ చేసి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్‌గా మారింది. యాంకర్ శివజ్యోతి ఇటీవల ఎక్కువగా కాంట్రవర్సీ అంశాలతో వార్తలలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమె ఆత్మహత్య యత్నం చేసుకున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయి. దీంతో ఆమె రంగంలోకి దిగి మరీ దీనిపై క్లారిటీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో మరల సావిత్రక్క ఏకంగా తాను స్నానం చేస్తున్న బాత్రూమ్ వీడియో ఒకటి రీల్ చేసింది. తీన్మార్ వార్తలలో శివజ్యోతి తెలంగాణ యాసలో ఎంత ఫేమస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. ముఖ్యంగా బిగ్ బాస్ 3 హౌస్ లోకి వెళ్లి అక్కడ కొన్ని వారాలపాటు గట్టిగా పోటీనిచ్చింది. ఆ తర్వాత పలు షోస్ లలో కూడా చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా.. శివజ్యోతి ఏకంగా తన భర్త కోసం అంటూ బాత్రూమ్ లో ఆమె స్నానం చేస్తున్న వీడియోను రికార్డు చేసుకుని మరీ రిలీజ్ చేసింది.







## మా అక్కను పెళ్లి చేసుకుంటే.. నేనూ కూడా వస్తాను..

### అడవి శేష్‌కు వన్ ప్లస్ వన్ ఆఫర్ ఇచ్చిన స్టార్ నటి..

స్టార్ నటి.. టాలీవుడ్ హీరో..అడవి శేష్ కు పెద్ద షాక్ ఇచ్చింది. తన అక్కను పెళ్లి చేసుకుంటే తాను కూడా వస్తాను అంటూ.. హీరో ముందరే చెప్పుకొచ్చింది. ఇంత ఈ నటి ఎవరు.. ఈ హీరోతో ఏమనింది అనే పూర్తి వివరాల్లోకి వెళితే.. టాలీవుడ్ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న హీరో అడవి శేష్. విభిన్న పాత్రలు, కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శేష్, తక్కువ సినిమాలతోనే ఎక్కువ క్రేజ్ సంపాదించాడు. హీరోగా ఎంట్రీ ఇచ్చే ముందు చిన్న, చిన్న పాత్రల్లో నటించిన శే 'కర్మ' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత 'పంజా' లో అతిథి పాత్రతో మెరిశాడు. 'గూఢచారి', 'హిట్ 2', 'ఎవరు', 'మేజర్' వంటి సినిమాలతో విజయాలతో తన స్థానాన్ని బలపరిచాడు. త్వరలో 'గూఢచారి 2' తో పాటు 'డకాయిట్' సినిమా తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఇటీవల, నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్ 3' లో గెస్ట్ పాత్రలో మెరిశాడు. ఈ నేపథ్యంలో, శే ఒక టీవీ డాన్స్ షోకి అతిథిగా వచ్చాడు. ఆ కార్యక్రమంలో బిగ్ బాస్ బ్యూటీ అశ్విని శ్రీ శేష్‌ను ఆశ్చర్యపరిచింది. అశ్విని శ్రీ, "మా అక్కకు మీరు చాలా ఇష్టం" అని శేష్‌క తెలిపింది. అంతేకాక, "మా అక్కను పెళ్లి చేసుకున్నారనుకోండి.. మీకు వన్ ప్లస్ వ ఆఫర్" అని ఆఫర్ ఇచ్చింది. ఇది విన్న ప్రతి ఒక్కరు ఆశ్చర్యపోయారు. వెంటనే శేష్ నవ్వుతూ "సరే సరే" అన్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY V. SAMPATH PRINTED AT SHARADHA PRINTERS, SHASTRI ROAD, KARIMNAGAR- 505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,Cell:9391343644
PUBLISHED AT H.NO.2-10-2126, MANKAMMATHOTA, BHAGYANANAR, KKARIMNAGAR, -505002, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE. EDITOR : V SAMPATH. TELTEL/2023/89146, EMAIL :shenarthimedia@gmail.com